# పోస్టాట




ఉం(టున్నది ఉత్తరాదిన. ఐదు నెలలు సమ్మరు. ఐదు నెల్లు వింటరు. మధ్యలో రెండు నెల్లు కొద్దిగా వెదర్ బాగుంటుంది కాస్తంత సాయంత్రాల షికారుకి. ఫ్రెండ్స్‌ని కలవటానికని బయలుదేరాం.

మేం వెళ్ళేటప్పటికి వాళ్ళ వాకిలి తలుపు తీసే వుంది. ఆయన, ఆవిడ గుమ్మానికి కడ్డంగా అటువైపు తిరిగి నుంచున్నారు. పిల్లలిద్దరూ చేతులు కట్టుకుని వీళ్ళవైపు తిరిగి నుంచున్నారు. కొద్దిగా పిల్లలు కనిపిస్తున్నారుగాని, ఆయన.ఆవిడ మాకు బాక్ చేసి నుంచోటం వల్ల మేం వచ్చినట్లు వాళ్ళకి తెలియదు.

ఆయన కూడా అప్పుడే ఆఫీసు నుంచి వచ్చేరేమో. బెల్టు సగం తీసినట్టుగా ప్యాంటుకి వేళ్ళాడుతోంది. ఆమె రెండు చేతులూ నడుముకు పెట్టుకుని ఏదో చెప్తున్నారు ఆయనతో. ఆయన మా పిల్లల మీద గట్టిగా కేకలేసున్నారు పిల్లల కళ్ళనుండి నీళ్ళయితే రావటంలేదుగాని, ఇద్దరూ ఎర్రగా అయిపోయి ఏ నిమిషానయినా ఏడవటానికి సిద్ధంగా వున్నారు.

ఆయన మధ్యలో ఆవిడవైపు తిరిగి "నీకసలు బుద్ధిలేదు. అసలలాంటివి ఎక్కడ పడితే అక్కడ పెట్టడమేమిటి?" అన్నారు. "ఇది మరి బాగుంది! ఎక్కడో పెట్టి అడుగున దాస్తే! నాకేం తెలుసూ. ఈ వెధవలిలా చేస్తారని!"

"వెధవల్లారా చంపేస్తాను, ఇంకెప్పుడయినా ఇలాంటి వెధవ పను చేశారంటే" అని ఇద్దరికీ రెండు అంటించారు.

ఇంతలో వాళ్ళ పెద్దవాడు మమ్మల్ని చూసి "డాడీ...."

"డాడీకె బచ్చె! ఎన్నిసార్లు చెప్పాను 'నాన్నా' అనాలని."

"అబ్బ వూరుకోండి. 'నాన్నా' అంటే తాతయ్యట హిందీలో వాళ్ళ ఫ్రెండ్సు నవ్వుతున్నారట 'మీ తాతయ్యా ఆయన' అని." పిల్లలవైపు తిరిగి "కానీ వారేయ్ పిల్లలూ ఆంధ్రా వెళ్ళినప్పుడు మాత్రం 'నాన్నగారండీ' అని చక్కగా పిలవాలి. తెలిసిందా?" అని నచ్చచెప్పారు. (పురాణం సీతగారి చింతబరికెలు జ్ఞాపకం వచ్చాయేమో!)

అంతలో వాళ్ళ రెండోవాడు "అంకుల్ వాళ్ళొచ్చారు" అన్నాడు.

"ఓ! మీరా రండి. రండి. ఎంతసేపయింది వచ్చి. సారీ, మావాళ్ళ గొడవతో తలప్రాణం తోకకొస్తోందనుకోండి. బోర్డింగ్‌లో పడెయ్యాల్సిందే. మా చేత కాకుండా వుంది వీళ్ళని పెంచడం" అన్నారు.

"పది నిమిషాలయి వింటున్నాంగాని

## మినీ కథావీధి

మాకేం అర్థంగాలేదు. అసలేం జరిగింది?" అన్నాం మేము.

"ఏం జరిగిందా" అని వాళ్ళిద్దరు ఒకరి ముఖాలొకరు చూసుకుని పెద్దగా నవ్వటం మొదలెట్టారు.

"ఇంతలా మీరు ఎంజాయ్ చేస్తుంటే, వాళ్ళనెందుకంతలా కోప్పడ్డారు?"

"ఎంజాయా మా తలకాయా, ఏడవలేక నవ్వుతుంటే. ఏం చేశారో తెలుసా? 'పోసుమాన్' ఆటట. నేనూ మా ఆవిడ పెళ్ళయిన కొత్తలో రాసుకున్న ఉత్తరాలన్నీ మా వీధిలో ఇళ్ళకున్న లెటర్ బాక్సుల్లో తలకొకటి చొప్పున వేశొచ్చారుట. మా ఆవిడ మధ్యాహ్నం నిద్దరలేచి పోసుకోసం చూస్తే మా ఉత్తరాలే వున్నాయట. ఇక్కడి వాళ్ళు హిందీ వాళ్ళుగనక, మేమేదో తెలుగులో ఏడిచాంగనక సరిపోయింది. ఏంచెయ్యమంటారు చెప్పండి? తెలుగు నేర్పించనందుకు చెంపలేసుకుంటున్నాం" అన్నారు, కాఫీ కప్పులు మావైపు జరుపుతూ.

పిల్లలేమో బతికాంరా భగవంతుడా అని నేసిన ఉత్తరాలు తీసుకు రావడానికి వీధిలో కెళ్ళారు.

(ఇది నిజంగా జరిగిన కథే.)